సాక్షి
బాపట్ల
బుధవారం ¦ 1 ¦ అక్టోబర్ ¦ 2025



ఆంజనేయ విగ్రహ పునఃప్రతిష్ట

వెల్దుర్తి: వజ్రాలపాడు సమీపంలోని చెరువులో వేంచేసి ఉన్న వీరాంజనేయ స్వామి వారి విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమం మంగళవారం వైభవంగా నిర్వహించారు.



ఇంద్రకీలాద్రిపై వేదసభ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం వేదసభ నిర్వహించారు. 450 మంది వేద పండితులు పాల్గొన్నారు.

9వ రోజు ఆదాయం రూ.40.12 లక్షలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాల్లో 9వ రోజైన మంగళవారం దుర్గగుడికి రూ.40.12 లక్షల మేర ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు. 2.29 లక్షల లడ్డూలను విక్రయించామని వివరించారు.

న్యూస్‌రీల్

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

బాపట్ల: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద వివిధ రకాల పింఛన్ల పంపిణీ బుధవారం చేయనున్నారు. జిల్లాలో మొత్తం 2,27,105 మందికి రూ.97.73 కోట్ల పంపిణీ చేయనున్నారు. బుధవారం ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరు ఎలాంటి ఆందోళన చెందరాదని, అధికారులు మీ ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందజేస్తారని తెలిపారు. బుధవారం పింఛన్ తీసుకోలేని వారు గురువారం తీసుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పునరావాస కేంద్రంలో వసతులపై ఆరా

పెనుమూడి పల్లెపాలెంలో మంత్రి అనగాని పర్యటన



రేపల్లె: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ వరద ముంపు ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించటంతోపాటు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతం పెనుమూడి పల్లెపాలెం గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉండే ప్రజలను అధికార యంత్రాంగం ఇప్పటికే చైతన్యం చేసి పునరావాస కేంద్రాలకు తరలించటం జరిగిందన్నారు. ఆయన వెంట ఆర్డీవో నేలపు రామలక్ష్మి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్, ఆర్‌సీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంతో పలువురికి నూతన జీవితం



ఇండ్లమూరి నాగేంద్రకుమార్



మువ్వా ప్రదీప్‌కుమార్

గుంటూరు మెడికల్: బ్రెయిన్ డెడ్ అయి లోకాన్ని విడిచిపోతున్న వారి అవయవాల దానంతో పలువురికి నూతన జీవితాన్ని ప్రసాదించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని జీవన్ దాన్ సంస్థ మంగళవారం బ్రెయిన్‌డెడ్ అయిన ఇద్దరి అవయవాలను అవసరమైన వారికి పంపింది. మంగళగిరిలోని ఎయిమ్స్‌లో ఇండ్లమూరి నాగేంద్ర కుమార్ (21) బ్రెయిన్ డెడ్ అయ్యారు. నాగేంద్రకుమార్ లివర్‌ను గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌కు మంగళవారం ప్రత్యేక గ్రీన్ చానల్ ద్వారా పోలీసుల సహకారంతో వైద్యులు తరలించారు. అలాగే, గన్నవరం పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయిన మువ్వా ప్రదీప్‌కుమార్ (46)కు చెందిన రెండు కిడ్నీలను కూడా ఇదే హాస్పిటల్స్‌కు పంపారు. ఈ సందర్భంగా హాస్పిటల్స్‌కు చెందిన డాక్టర్ కార్తీక్ చౌదరి మాట్లాడుతూ.. పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా బ్రెయిన్ డెడ్ అయిన తమ వారి అవయవాలను కుటుంబసభ్యులు దానం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేల మంది వివిధ అనారోగ్యాలతో బాధపడుతూ అవయవాల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. డాక్టర్ అనుష మాట్లాడుతూ ఒకరికి అవయవదానం చేసి జీవితాన్ని ప్రసాదించడం వల్ల వారి కుటుంబం మొత్తం ఆనందంగా ఉంటుందన్నారు.

షటిల్ టోర్నమెంట్‌లో విజేతగా శ్రీసూపర్ కింగ్స్

గుంటూరు మెడికల్: గుంటూరులో వైద్యుల షటిల్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం విజయవంతంగా జరిగాయి. గుంటూరు అమరావతి రోడ్డులో జరిగిన షటిల్ టోర్నమెంట్‌లో వంద మందికి పైగా వైద్యులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతగా శ్రీసూపర్‌కింగ్స్ నిలిచారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ కె.కళ్యాణ్ చక్రవర్తి కెప్టెన్‌గా ఆడిన షటిల్ టోర్నమెంట్‌లో కార్డియాలజిస్ట్ డాక్టర్ బి.వి.నారాయణరెడ్డి, స్పైన్ సర్జన్ డాక్టర్ డి.శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్‌లు టీమ్‌గా ఆడి కప్పు గెలుచుకున్నారు. ఫైనల్‌లో సందీప్ స్మైకర్స్ టీమ్‌ను 3.1 తేడాతో ఓడించి శ్రీసూపర్ కింగ్స్ విజేతగా నిలిచారు. శ్రీ సూపర్ కింగ్స్ టీమ్ వైద్యులకు పలువురు వైద్యులు అభినందనలు తెలిపారు.

దేవతాస్వరూపిణి దుర్గమ్మ



గోవాడ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి దుర్గాదేవి అలంకారం



రేపల్లె పట్టణంలోని ఇసుకపల్లిలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు



చందోలులో మహాదుర్గాదేవి అలంకారంలో బగళాముఖి అమ్మవారు



బాపట్లలో దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తున్న జిల్లెళ్లమూడి అమ్మవారు

జిల్లా వ్యాప్తంగా దేవి శరన్నవరాత్ర్యుత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. పలు ఆలయాలలో మంగళవారం దుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. చందోలులోని బగళాముఖి అమ్మవారు శ్రీ మహాదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు గ్రామాలలోని అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి పూలు, పండ్లు సమర్పించి కుంకుమ పూజలు చేశారు. ఇసుకపల్లిలోని ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

–చందోలు(కర్లపాలెం)/రేపల్లె/బాపట్లటౌన్

పేదోడికి వైద్యం దూరం చేసే కుట్ర

- ప్రభుత్వమే మెడికల్ కళాశాలల నిర్మాణ బాధ్యతలు తీసుకోవాలి
- అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో నిరసన
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మేరుగ నాగార్జున



నిరసన ప్రదర్శనలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున, రేపల్లె సమన్వయకర్త ఈవూరి గణేష్, ఎస్సీ విభాగం నాయకులు

బాపట్ల: పేదోడికి ప్రభుత్వ వైద్యం అందకూడదనే కుట్రతోనే కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున ధ్వజమెత్తారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయరాదని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి నిరసన ప్రదర్శన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సర్కిల్ వరకు సాగింది. అనంతరం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పాదం వద్ద మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రైవేటు పరం చేయొద్దంటూ వినతిపత్రం ఉంచి నినాదాలు చేశారు. నిరసనను ఉద్దేశించి డాక్టర్ మేరుగ నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదోడికి కార్పొరేట్ వైద్యం అందించాలనే తలంపుతో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ తీసుకువచ్చి ఎంతో మందికి ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించారని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసిన రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి అనుమతి తెలియజేయటంతోపాటు నిధులు కూడా సమకూర్చటం జరిగిందన్నారు. ఐదు మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తికాగా రెండు కళాశాలలో తరగతులు ప్రారంభించుకునే దశలో ఉందన్నారు. మిగిలిన కళాశాలలు కూడా 50 నుంచి 80 శాతం పనులు పూర్తి చేసుకునే దశలో ఉండగా చంద్రబాబునాయుడు సర్కారు కుట్రకు పూనుకుందన్నారు. వైద్యాన్ని కార్పొరేట్ శక్తులలో పెట్టేందుకే ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిందన్నారు. ఈ విధానంతో పేదలకు వైద్యం అందకుండా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. ఖచ్చితంగా మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్మించే విధంగా రాబోయే జగనన్న ప్రభుత్వం ఆ బాధ్యత తీసుకుంటుందన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ మేరుగ నాగార్జున, ఈవూరి గణేష్

10 రోజుల్లోనే అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుచేస్తాం

పర్చూరు నియోజకవర్గంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలంటే అనుమతులు కావాలంటూ అక్కడ కార్యకర్తలపై దాడులు చేయటం హేయమైన చర్యగా నాగార్జున పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు నిరాకరించిన ప్రదేశంలోనే 10 రోజులలోపు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

డిజిటల్ బుక్‌తో సమాధానం చెబుతాం

ప్రజావ్యతిరేక విధానాలు చేపట్టే వారికి డిజిటల్ బుక్ సరైన సమాధానం చెబుతుందని డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు సర్కారు కొన్ని చేయకూడదని పనులు అధికారులతో చేయించి వారిన్ని బాధ్యులుగా చేస్తుందన్నారు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో నేరుగా అధికారులనే బాధ్యులుగా చేసి మాట్లాడటం చంద్రబాబునాయుడు కుటిల రాజకీయాలకు నిదర్శంగా చెప్పవచ్చనన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు చేపట్టే అధికారుల పేర్లు డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తామని, అధికారం వచ్చాక..వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

> **వైద్యం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకూడదు**
>
> వైద్యం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారని రేపల్లె సమన్వయకర్త ఈవూరి గణేష్ పేర్కొన్నారు. ఈపాటికే రెండు మెడికల్ కళాశాలలో సీట్లను భర్తీ చేయకపోవటంతో అవి వెనక్కివెళ్లాయని చెప్పారు. ఈవిధానాలను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నిర్మించే విధంగా ఉద్యమం తీసుకురావాలని అన్నారు.
>
> –ఈవూరి గణేష్, వైఎస్సార్ సీపీ రేపల్లె సమన్వయకర్త

> **ఏ త్యాగానికైనా సిద్ధం**
>
> మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్మించే విధంగా ఏ త్యాగానికైనా సిద్ధమని వాసిమల్ల వాసు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైద్యం అందించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తే ఆ వైద్యానికి దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం చేస్తే చూస్తూ ఊరుకునేదిలేదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు చేజర్ల నారాయణరెడ్డి, నక్కా వీరారెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, చల్లా రామయ్య, వడ్డిముక్కల డేవిడ్, బడుగు ప్రకాశ్, మండే విజయ్‌కుమార్, చిత్రాల ఒబేద్, నన్రావుల వెంకట్రావు, జోగి రాజా, అడేచంద్, తన్నీరు అంకమ్మరావు, గంగిశెట్టి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అధైర్య పడొద్దు

- జిల్లా యంత్రాంగం అండగా ఉంటుంది
- ట్రాక్టర్లు, బోట్లు అందుబాటులో ఉండాలి
- పునరావాస కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



బాపట్ల: ''అధైర్య పడవద్దు.. జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని'' జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ లోతట్టు ప్రాంతాల ప్రజలకు భరోసా ఇచ్చారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆర్డీఓ, భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు హెబిటేషన్, పునరావాస కేంద్రాల ఇన్‌చార్జిలతో వరద ప్రవాహ పరిస్థితిపై మంగళవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాక్టర్లు, బోట్లు సిద్ధంగా పెట్టుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో ఉన్న బాధితులకు అన్ని సౌకర్యాలు ఉండేలా ఇన్‌చార్జి చూసుకోవాలన్నారు. వరద ఉధృతి పెరిగినా ఎదుర్కొనడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాలకు కేటాయించిన అధికారులు, సిబ్బంది రాత్రీపగలు అక్కడే ఉండాలన్నారు. నదిలో నీటి ప్రవాహం తగ్గే వరకు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

దళితులపై దాడులు చేస్తే ఊరుకోం

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున
- సీఐ శేషగిరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



ద్రోణాదుల సర్పంచ్ భాగ్యారావు తల్లిదండ్రులను పరామర్శిస్తున్న డాక్టర్ మేరుగ నాగార్జున

పర్చూరు(చినగంజాం): దళితులపై అన్యాయంగా దాడులు.. అమానుష చర్యలకు పాల్పడితే అధికార పార్టీ అయినా.. అధికారులైనా చూస్తూ ఊరుకోబోమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున హెచ్చరించారు. మార్టూరు మండలం దేగర్లమూడిలో ఇటీవల సీఐ శేషగిరి అమానుష చర్యలకు బాధితులైన దళిత యువకులు జ్యోతి పోతులూరి, అల్లడి ప్రమోద్ కుమార్‌తో పాటు బాధితులను పరామర్శించేందుకు మంగళవారం ఆయన గ్రామాన్ని సందర్శించి మాట్లాడారు. మార్టూరు మండలం దేగర్లమూడిలో జగనన్న కాలనీ ప్రవేశంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గ్రామ కంఠానికి సంబంధించిన భూమిలో ఏర్పాటు చేసుకునేందుకు గ్రామంలోని యువత ఏర్పాట్లు చేసుకున్నారని తెలిపారు. దేశంలో అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టుకునేందుకు ఎటువంటి ఆంక్షలు లేవని, రాష్ట్రంలో మహనీయులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ అంబేడ్కర్, వంగవీటి మోహనరంగా వంటి చరిత్ర కలిగిన నాయకుల విగ్రహాలను పెట్టుకున్నామన్నారు. కానీ దేగర్లమూడిలో గ్రామ కంఠంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు పంచాయతీ అనుమతి ఉన్నప్పటికీ గ్రామ కార్యదర్శి మీకు అనుమతి లేదంటూ విగ్రహాన్ని దొంగిలించుకుపోయారన్నారు. అదే ప్రాంతంలో విగ్రహాలు పెట్టకూడదని పోలీస్ అధికారులు ఆంక్షలు పెట్టడం, విగ్రహాన్ని ఏర్పాటు చేసే విషయంలో యాక్టివ్‌గా ఉన్న ఇద్దరు యువకులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి చితకబాదారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏమి జరుగుతుందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. స్థానికంగా కొందరు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసే విషయంలో పోలీస్ అధికారులను సమాయత్తం చేయడంతో వారు యువకులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొని వెళ్లి అమానుషంగా కొట్టడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. అధికారులు వారం రోజుల్లో విగ్రహాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారని.. లేని పక్షంలో 10 రోజుల్లో తామే విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంబేడ్కర్ విగ్రహాన్ని దొంగిలించిన గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్‌ని కలిసి సీఐపై చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. విగ్రహాల ఏర్పాటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని ప్రజాస్వామ్యంలో విగ్రహాల ఏర్పాటుకు స్వేచ్ఛ ఉందన్నారు.

ద్రోణాదుల సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

మార్టూరు సీఐ శేషగిరిరావు అమానుష చర్యకు బలై తీవ్రగాయాలపాలైన ద్రోణాదుల సర్పంచ్ వంకాయలపాటి భాగ్యారావు కుటుంబాన్ని మేరుగ నాగార్జున పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ నాయకుడు పోపూరి వెంకట్రావు ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భవనం శ్రీనివాసరెడ్డి, ఎస్సీ విభాగం పర్చూరు నియోజకవర్గ అధ్యక్షుడు నూతలపాటి బలరాం, ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పాలెపోగు రాంబాబు, యువజన విభాగం కార్యదర్శి ఉప్పలపాటి అనిల్‌చౌదరి, మాచవరపు రవికుమార్, గర్నెపూడి రవిచంద్, బండి రాంబాబు, జంపని వీరయ్య చౌదరి, రావూరి వేమబాబు, మువ్వల రాంబాబు, పాదర్తి ప్రకాష్, పఠాన్ కాలేష వలి, కట్టా రత్నరాజు, మైలా చిన నాగేశ్వరరావు, బూరగ రాము, గోపతోటి బాబురావు, సూరవరపు వందనం, వాసుమల్లి వాసుబాబు, కూరాకుల ఇసాక్ బాబు, కుమ్మరి చందు, యాతం మేరీ బాబు, పులిపాటి అరుణ్, జంగం మహేష్, గొర్రె ముచ్చు సుబ్బారావు, వల్లపునేని లక్ష్మీనారాయణ, జి.చిన్న, సురేష్, తమ్మలూరి సురేష్ బాబు, తమ్మా అమ్మిరెడ్డి, గడ్డం మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

7న చలో విజయవాడకు ఫ్యాప్టో పిలుపు

గుంటూరుఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పిలుపు మేరకు ఈనెల 7న విజయవాడలోని ధర్నా చౌక్‌లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు నక్కా వెంకటేశ్వర్లు, గుత్తా శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కె.నరసింహారావు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు ధర్నా సన్నాహక సమావేశాన్ని మంగళవారం నగరంపాలెంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు.

- గుత్తా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించడంతోపాటు, 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి మంజూరు, పాత పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని తెలిపారు.
- నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగులకు స్నేహపూరిత ప్రభుత్వమని చెబుతూనే రాష్ట్రంలోని 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించిన, చర్చించిన పరిస్థితులు లేవన్నారు.
- కె. నరసింహారావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దాదాపు రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరినప్పటికీ ఇంతవరకు స్పందన లేదన్నారు.
- సెక్రటరీ జనరల్ కె.వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో విద్యా రంగ, ఆర్థిక సమస్యలపై చర్చించి పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, ఏపీటీఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు, ఫ్యాప్టో జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎండీ ఖాలీద్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.కళాధర్, జి.వెళాం గిణిరాజు, జిల్లా నాయకులు దిబ్బయ్య, ఎం.కోటిరెడ్డి, షేక్ బాజి బాలాజీ, ప్రసాద్, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

క్లుప్తంగా

3 నుంచి డీఎస్సీ-2025 ఉపాధ్యాయులకు శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో డీఎస్సీ-2025 ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులకు ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పాఠశాల విద్య ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి, డీఈవో సీవీ రేణుక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, నరసరావుపేట. వినుకొండ, బాపట్లలో ఏర్పాటు చేసిన ఐదు శిక్షణ కేంద్రాల్లో ఆయా సబ్జెక్టులవారీగా రెసిడెన్షియల్ విధానంలో జరిగే ఈ కార్యక్రమానికి సంబంధిత ఉపాధ్యాయులు హాజరు కావాలని సూచించారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలతో పాటు జోన్-3 పరిధిలోని పీజీటీ, టీజీటీలుగా ఎంపికైన అభ్యర్థులు 3న ఆయా కేంద్రాల్లో ఉదయం 7 గంటలకు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. శిక్షణకు ఆలస్యంగా వచ్చినా, ముందుగానే వెళ్లిపోయినా గైర్హాజరుగా పరిగణిస్తామని తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి నూరుశాతం హాజరు ఉండాలని, అధునాతన ఆండ్రాయిడ్ ఫోన్‌తోపాటు అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను వెంట తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు తమ వ్యక్తిగత ఔషధాలతోపాటు వారం రోజులకు సరిపడా వస్త్రాలను కూడా తెచ్చుకోవాలి తెలిపారు. పాలు తాగే చంటిబిడ్డలు ఉన్న తల్లులు తమ వెంట సహాయకులుగా ఒకరిని తెచ్చుకునేందుకు అనుమతి ఉందని పేర్కొన్నారు.


సాగర్‌బాబుకు న్యాయం చేస్తాం



నరసరావుపేట రూరల్: విద్యుత్ షాక్‌కు గురై వికలాంగుడిగా మారిన సాగర్‌బాబు ఘటనలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. జొన్నలగడ్డలోని విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం వద్ద సాగర్‌బాబు కుటుంబం గత రెండురోజులుగా నిరాహార దీక్షలు చేపట్టారు. మంగళవారం చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఎస్ఈ సందర్శించి, సాగర్‌బాబు భార్య కెజియాతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు ఎస్ఈని కలిసి చర్చించారు. సాగర్‌బాబు కుటుంబం గత 17 రోజులుగా రిలే నిరాహార దీక్షలు, రెండు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. వారి ఆరోగ్యం క్షీణిస్తుందని వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ ఘటనలో విద్యుత్ అధికారులకు ఎలాంటి సంబంధం లేదని గ్రామ పెద్దలు రాతపూర్వకంగా ఇచ్చారని ఎస్ఈ తెలపగా.. రెండున్నర సంవత్సరాల క్రితం ఘటన జరిగితే ఇప్పుడు నకిలీ లెటరు తీసుకువచ్చి చూపడం సరికాదని, ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. సాగర్‌బాబుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై శాఖాపరంగా విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారు. దీంతో సాగర్‌బాబు కుటుంబసభ్యులు రిలే నిరాహార దీక్షలను విరమించారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వర్లు, నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి జి.రామకృష్ణ పాల్గొన్నారు.

దివ్యం.. దుర్గమ్మ దర్శనం

- వైభవంగా దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు
- వేదపఠనంతో మార్మోగిన ఇంద్రకీలాద్రి
- అమ్మ దర్శనానికి తరలివస్తున్న భవానీలు
- నేడు మహిషాసురమర్దినిగా దర్శనమివ్వనున్న దుర్గమ్మ



విద్యుత్ దీపాల వెలుగుల్లో ఇంద్రకీలాద్రి పరిసరాలు (ఇన్‌సెట్) దుర్గమ్మగా దర్శనమిచ్చిన అమ్మవారు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ మంగళవారం శ్రీదుర్గాదేవి అలంకారంలో భక్తులను కరుణించారు. లోకకంటకుడైన దుర్గమాసురుడనే రాక్షకుడిని వధించి ఇంద్రకీలాద్రిపై దుర్గాదేవిగా కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము మూడు గంటలకు అమ్మవారికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత క్యూలైన్‌లోకి చేరిన భక్తులకు తెల్లవారుజామునే దర్శనం పూర్తయింది. మధ్యాహ్నం నుంచి వర్షం పడటంతో క్యూలైన్‌లో ఉన్న భక్తులు, అమ్మవారి దర్శనం పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమైన వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వీఐపీలు, సిఫార్సులతో దర్శనానికి వచ్చే వారి సంఖ్య అంతంత మాత్రంగానే కనిపించింది. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత వీఐపీల తాకిడి పెరగడంతో ఆలయ ప్రాంగణంలో కాస్త గందరగోళ పరిస్థితులు కనిపించాయి. కనకదుర్గమ్మ బుధవారం శ్రీమహిషాసుర మర్దినీదేవిగా దర్శనమిస్తారు.



కుంకుమ పూజలో పాల్గొన్న యువతులు



క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు

ముగింపు దశకు ఉత్సవాలు

గత నెల 22వ తేదీన ప్రారంభమైన దసరా ఉత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. గురువారం శ్రీరాజరాజేశ్వరి అలంకారం, ఉదయం పది గంటలకు యాగశాలలో మహా పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో అమ్మవారి దీక్ష స్వీకరించిన భవానీల రాక ప్రారంభమైంది. దీంతో పోలీసులు, ఇటు రెవెన్యూ అధికారులు అప్రమత్తమై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భవానీమాలధారుల రాకతో ఆలయ పరిసరాలు అరుణ వర్ణాన్ని సంతరించుకున్నాయి.

దుర్గమ్మ సేవలో దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ శీనానాయక్ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ అధికారులు అమ్మవారి చిత్ర పటం, ప్రసాదాలను అందించారు. పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. సినీ నటి హేమ అమ్మవారిని దర్శించుకున్నారు.

దుర్గగుడిలో నేడు

- బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనం
- ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన
- ఉదయం 7 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక చండీయాగం, ప్రత్యేక శ్రీచక్రనవార్చన
- సాయంత్రం 5 గంటలకు ఆదిదంపతుల నగరోత్సవం
- సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి మహా నివేదన, పంచహారతుల సేవ, వేద స్వస్తి

విజయ దశమి రోజు అన్ని వీఐపీ దర్శనాలు రద్దు

దసరా ఉత్సవాల్లో 11 రోజైన విజయ దశమి రోజున అన్ని వీఐపీ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. తెల్లవారుజాము నుంచే వీఐపీ దర్శనాలు నిలిపివేయడంతో పాటు కొండపైకి వీఐపీ వాహనాలను సైతం అనుమతించేది లేదని స్పష్టంచేశారు. సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ.300 టికెట్ల క్యూలైన్లలో సైతం భక్తులు ఉచిత దర్శనం కల్పిస్తున్నామని తెలిపారు.

నెమలివాహనంపై ఆది దంపతులకు నగరోత్సవం



నెమలి పల్లకిపై ఆదిదంపతులు

దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీగంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వార్లుకు నెమలి వాహనంతో నగరోత్సవం నిర్వహించారు. నెమలి కనులతో తీర్చిదిద్దన పల్లకీపై ఆదిదంపతులు ఇంద్రగిరి వీధుల్లో విహరించారు. సాయంత్రం వర్షం పడటంతో నగరోత్సవ సేవ గంట ఆలస్యంగా ప్రారంభమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తజనుల కోలాహలం నడుమ ఊరేగింపు కనుల పండువగా సాగింది.

ఉత్కంఠగా కొనసాగుతున్న చెస్ పోటీలు



చెస్ ఆడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో లంకా రవి తదితరులు


చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్కంఠగా కొనసాగుతున్నాయి. ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఈ పోటీలు జరుగుతున్నాయి పదో రోజైన మంగళవారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ హాజరయ్యారు. ఆట ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ చదరంగాన్ని బ్రెయిన్ గేమ్ అని కూడా అంటారన్నారు. నిజమైన విజయమంటే ప్రత్యర్థిని ఓడించడం మాత్రమే కాదని, మనలోని ఆలోచనా శక్తిని పెంచుకోవడమనిఅభిప్రాయపడ్డారు. మాస్టర్ లంకా రవి మాట్లాడుతూ చదరంగం అనేది ఒక మేధో క్రీడ మాత్రమే కాకుండా, అనేక నైపుణ్యాలను నేర్పే వేదికన్నారు.

9వ రౌండ్ ఫలితాలు

తొమ్మిదో రౌండ్‌లో సంచలనాలు చోటుచేసుకున్నాయి. ముగ్గురు గ్రాండ్‌మాస్టర్లు, మాజీ జాతీయ చాంపియన్లు కూడా ఇంటర్నేషనల్ మాస్టర్ల చేతిలో ఓటమిపాలయ్యారు. పీఎస్‌పీబీకి చెందిన జీఎం సశికిరణ్ కృష్ణన్ గెలుపు అవకాశాన్ని కోల్పోయినా 7.5 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నాడు. తమిళనాడుకు చెందిన జీఎం ఇనియన్ పి.ఎ., కేరళకు చెందిన ఐఎం గౌతమ్ కృష్ణ. హెచ్ కూడా అతనితో సమంగా లీడ్‌లో చేరారు. ఇంకా రెండు రౌండ్లు మిగిలి ఉండటంతో టైటిల్ పోరు ఉత్కంఠభరితంగా మారింది. పీఎస్‌పీబీకి చెందిన టాప్ జీఎంలు సూర్యశేఖర్ గంగూలీ, అభిజిత్ గుప్తా, ఎస్‌పీ సేతురామన్ వరుసగా గోవా ఐఎం రిత్విజ్ పరాబ్, కేరళ ఐఎం గౌతమ్ కృష్ణ, తమిళనాడు ఐఎం మనిష్ ఆంటో క్రిస్టియానో చేతిలో ఓడిపోయారు.

వల విసరక.. బతుకు సాగక..

- దయనీయంగా మత్స్యకారుల జీవితాలు
- మూడు నెలలుగా కృష్ణానదికి తరచూ వరదలు
- చేపల వేటకు వెళ్లలేని పరిస్థితిలో ఆర్థిక కష్టాలు
- ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని వేడుకోలు



ప్రకాశం బ్యారేజ్ దిగువన ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది



సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద మత్స్యకారులు నిలిపివేసిన పడవలు

తాడేపల్లి రూరల్ ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణానదిలో చేపలు వేటాడే మత్స్యకారుల బతుకు దయనీయంగా ఉంది. గత రెండు నెలల నుంచి కృష్ణానదికి తరచూ వరద రావడంతో వల విసరలేని పరిస్థితి నెలకొంది. పొట్ట నింపుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యారేజ్ ఎగువ, దిగువ ప్రాంతాల్లో సుమారు 450 కుటుంబాలు చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. వీరే కాకుండా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి నుంచి వలస వచ్చిన మరో 50 కుటుంబాలు కృష్ణానదిని నమ్ముకునే ఇలా బతుకుతున్నాయి. నదికి కొన్ని నెలలుగా వరద పోటెత్తుతూ ఇప్పుడు 6 లక్షల క్యూసెక్కుల వరకు చేరింది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లాలంటే కృష్ణానది గేట్లు తప్పని సరిగా మూసి ఉండాలి. లేని పక్షంలో పడవ నిలిచి వల వేడయానికి కుదరదు. నాలుగైదు నావల వారు కలిసి రాత్రి సమయంలో కృష్ణానదిలో అక్కడక్కడ రంగ వలలతో బుట్టలను ఏర్పాటు చేస్తారు. వరద రావడంతో అవి కొట్టుకుపోతున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. గత మూడు నెలలుగా అందిన చోట అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద సొసైటీలు ఉన్నాయని, వాటి ద్వారా మత్స్యశాఖ అధికారులు ఆర్థిక సహాయాన్ని అందించాలని విన్నవించారు. రేషన్ సరకులు అందజేస్తే కడుపు నింపుకొంటామన్నారు. ప్రస్తుతం తమ కుటుంబాలు అర్ధాకలితో జీవించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

దోచుకుంటున్న వ్యాపారులు....

కృష్ణానదిలో చేపల వేట లేకపోవడంతో ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతంలోని సీతానగరానికి వెళ్లే మార్గంలో చేపల వ్యాపారుల తమకు ఇష్టం వచ్చిన ధరలతో విక్రయిస్తున్నారు. కేజీ చెరువు చేపలను రూ.300 - రూ.500 వరకు అమ్ముతున్నారు. అవి కూడా కృష్ణానది చేపలు అంటూ అంటగడుతున్నారు. దిగువ ప్రాంతంలో చేపల వ్యాపారులు ఏర్పాటు చేసిన కాటాల్లో సైతం భారీ వ్యత్యాసం కనబడుతోంది. కేజీ చేప తీసుకుంటే 750 గ్రాములే ఉంటోందని పలువురు వాపోతున్నారు. తూనికలు, కొలతల అధికారులకు ఫిర్యాదు అందడంతో తనిఖీ చేయగా మోసం వెలుగుచూసింది. 15 కాటాలు సీజ్ చేసి, కేసులు నమోదు చేశారు. అయినా వ్యాపారులు తమ తీరు మార్చుకోవడం లేదని పలువురు కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు చేయాల్సి వచ్చింది



ప్రకాశం బ్యారేజ్ వద్ద మూడు నెలల నుంచి వరద వస్తూనే ఉంది. కొంచెం తగ్గిందని బుట్టలు ఏర్పాటు చేస్తే రాత్రికి రాత్రి వరద వచ్చి కొట్టుకుపోతున్నాయి. వలకు చేప చిక్కితేనే మా కడుపు నిండేది. మూడు నెలల నుంచి చేపల వేట లేకపోవడంతో చాలా మంది అధిక వడ్డీలకు డబ్బులు తీసుకుని ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– లంకె అప్పారావు

వరదతో కుదరని వేట



ప్రకాశం బ్యారేజ్ వద్ద గేట్లు ఎత్తి భారీగా వరద నీటిని కిందకి వదులుతున్నారు. మూడు నెలలుగా ఇదే పరిస్థితి ఉంది. దీంతో పడవ నడపడం కష్టంగా మారింది. మర పడవలు ఏదో ఒక విధంగా నడపవచ్చు. నాటు పడవలు నడపడం చాలా కష్టం. మర పడవలు కూడా వల వేయడానికి ఆపితే కొట్టుకుపోతాయి. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో చేపల వేట లేక ఇబ్బంది పడుతున్నాం.

– కొక్కిలిగడ్డ నాగార్జున

మరో పని తెలియదు



మాకు చేపల వేట తప్ప మరో పని తెలియదు. మా తాతలు, తండ్రుల దగ్గర నుంచి కృష్ణమ్మనే నమ్ముకుని జీవిస్తున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం ఎగువ ప్రాంతాలలో వర్షాలు కురియడంతో మూడు నెలల నుంచి బ్యారేజీ గేట్లు తెరిచే ఉన్నాయి. దీంతో చేపల వేటకు వెళ్లలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం.

– సైకం నాగబాబు

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యుల నిరసన

నరసరావుపేట టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు మంగళవారం పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పీహెచ్‌సీ వైద్యులు ఓపీ సేవలు బహిష్కరించి నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ మమతే ప్రియ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ సేవలు నిలిపివేశామని, అత్యవసర చికిత్సలకు సేవలందిస్తున్నామన్నారు. సుమారు 25 సంవత్సరాల నుంచి పదోన్నతులు లేక ఒకే హోదాలో సేవలందిస్తున్న వైద్యాధికారులకు న్యాయం చేయాలన్నారు. ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనం గిరిజన భత్యంగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ.5 వేలు భత్యం ఇవ్వాలన్నారు. బుధవారం పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపడతామన్నారు. గురువారం విజయవాడ వైద్య శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టటం జరుగుతుందన్నారు. అప్పటికీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యులు రమ్య, జగన్ నరసింహారెడ్డి, రాధాకృష్ణన్, ప్రదీప్, బాల అంకమ్మ పాల్గొన్నారు.

రూ.వంద కోసం ఘర్షణ.. కత్తితో దాడి



గాయపడిని షేక్ జానీబాషా

పిడుగురాళ్ల: వందరూపాయల కోసం ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణ కత్తితో దాడి చేసుకునేంతగా వెళ్లిన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం... పట్టణంలోని హైస్కూల్ కాంప్లెక్స్‌లోని వీరభద్ర చికెన్ షాప్‌లో జానీ బాషా, రియాజ్ అనే ఇద్దరు పని చేస్తూ ఉంటారు. జానీబాషా రియాజ్‌కు రూ.100 ఇవ్వాల్సి ఉంది. ఈ విషయమై రియాజ్ అడగ్గా.. తనకు అంతకు ముందు రూ. 300 ఇవ్వాలని అవి ఇస్తే.. రూ.వంద ఇస్తానని జానీబాషా చెప్పటంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇద్దరు తోపులాట చేసుకుంటుండగా రియాజ్ వెంటనే పక్కనే మేక తోలు తీసే కత్తితో జానీబాషా పొట్టలో పొడిచాడు. జానీబాషా పొట్టలో నుంచి పేగులు బయటకు రావటంతో వెంటనే స్థానికులు ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. పట్టణ ఎస్ఐ శివనాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైకులు, దుకాణం దహనం

లక్ష్మీపురం: చిరు వ్యాపారం చేసుకునే దుకాణం, రెండు ద్విచక్రవాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్తంభాలగరువు ప్రాంతంలోని మధుసూధనరెడ్డి అనే వ్యక్తి ఇంటి బయట భాగంలో చిన్నపాటి కొట్టును ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. దుండగులు ఆ కొట్టుకు, అదే ప్రాంతంలో శివరామ్ అనే వ్యక్తికి సంబంధించిన రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు అంటించారు. గమనించిన స్థానికుల మంటలు అదుపు చేశారు. అప్పటికే అవి దహనమయ్యాయి.

అలరించిన 'మోహినీ భస్మాసుర'



'మోహినీ భస్మాసుర'లో ఓ సన్నివేశం

తెనాలి: పురాణగాథ 'మోహినీ భస్మాసుర' పద్య నాటకంగా పండిత పామరులను అలరిస్తూనే ఉంది. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరుగుతున్న వీణా అవార్డ్స్-2025 జాతీయ పంచమ పద్యనాటక, సాంఘిక నాటక/నాటికల పోటీల్లో నాలుగోరోజైన మంగళవారం తొలి ప్రదర్శనగా ఈ నాటకం అలరించింది. విజయనగరానికి చెందిన అక్కినేని సాంస్కృతిక సమాజం ప్రదర్శించగా, వీక్షకుల కరతాళధ్వనులను అందుకుంది. వృకాసురుడనే రాక్షసుడు అయిదేళ్లపాటు భీకర తపస్సు చేయటంతో శివుడు ప్రత్యక్షమై, అడిగినదే తడవుగా ఎవరి తలపైనయినా చేయి పెట్టిన వెంటనే అతడు భస్మమయేలా, ఎవరివల్ల కూడా వృకాసురుడికి మరణం లేకుండా వరాలిస్తాడు. ఈ వరాలతో జరిగే కీడు తెలిసిన నారదుడు రెచ్చగొట్టటంతో వరాన్ని పరీక్షించుకునేందున వృకాసరుడు నేరుగా శివుడు దగ్గరకు వెళతాడు. శివుడు తప్పించుకుని శ్రీవిష్ణువును శరణు వేడతాడు. విష్ణువు నారదుడిని సంప్రదించి, మోహినీరూపం దాల్చి వృకాసురుని అంతమొందించటం ఇతివృత్తం. మద్దెల పంచనాదం రచనకు గవర సత్తిబాబు దర్శకత్వం వహించారు. వృకాసురుడుగా దాసరి తిరుపతినాయుడు, మోహినిగా కేవీ పద్మావతి, లక్ష్మీదేవిగా పి.నీలవేణి, నారుదుడిగా గవర సత్తిబాబు పాత్రోచితంగా నటించారు.

ఆకట్టుకున్న ఇతివృత్తాలు

అనంతరం టీజీవీ కళాక్షేత్రం, కర్నూలు వారి 'జగదేక సుందరి సామా' పద్యనాటకాన్ని ప్రదర్శించారు. సామా అనే వేశ్య ఎందరినో బానిసలను చేసుకుంటుంది. వేలంలో కొనుగోలు చేసిన బానిస మాఘపై మనసు పడుతుంది. ఆమె దగ్గర బానిసలను విడిపించటానికి మాఘ ఆమెను ప్రేమిస్తున్నట్టు నటిస్తాడు. అతడి మాటలను నమ్మి బానిసలు విడుదల చేస్తుంది. ఆ వెంటనే సామా ఎదుటనే మాఘ విషం తీసుకుని మరణిస్తాడు. విరక్తి చెందిన సామా ఆత్మహత్యకు పూనుకోగా, పుణ్యకుడు అనే బౌద్ధగురువు హితబోధతో బౌద్ధసన్యాసినిగా మారుతుంది. సామాగా ప్రముఖ రంగస్థల, సినీనటి సురభి ప్రభావతి అద్భుతంగా నటించారు. ఇతర పాత్రల్లో జీవీ శ్రీనివాసరెడ్డి, కె.బాలవెంకటేశ్వర్లు, పి.రాజారత్నం నటించారు. పల్లేటి కులశేఖర్ రచనకు పద్యాలు/దర్శకత్వం పత్తి ఓబులయ్య. అనంతరం మానవత, యడ్లపాడు వారి 'అంతా మంచివారే...కానీ' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. రచన, దర్శకత్వం జరుగుల రామారావు. చివరగా అభ్యుదయ ఆర్ట్స్, విజయవాడ వారు 'క్రతువు' సాంఘిక నాటికను ప్రదర్శించారు. కేవీవీ సత్యనారాయణ రచనకు వేంపాటి రమేష్ దర్శకత్వం వహించారు. నాటకపోటీలను కళల కాణాచి, తెనాలి, ఆర్ఎస్ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో కొనసాగిస్తున్నారు.